క్లుప్తంగా

మాజీ సీఎం భద్రతపై ప్రభుత్వ తీరు దారుణం

విించిపేట(విజయవాడపశ్చిమ): మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భద్రతపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని వక్ఫ్‌బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విించిపేట, నైజాం గేటు సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రత విషయంలో ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తాము అధికారంలో ఉండగా ఏనాడు చంద్రబాబు రక్షణ విషయంలో ఇలా వ్యవహరించలేదని, ఇలా తమ ప్రభుత్వం చేసి ఉంటే నాడు చంద్రబాబు బయట తిరగగలిగే వారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ పర్యటన తోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారన్నారు. ప్రభుత్వం ఇకనైనా ఇటువంటి కుట్రపూరిత కార్యక్రమాలను కట్టిపెట్టి ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

రేపటి నుంచి 'హై లైఫ్ ఎగ్జిబిషన్'



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 21, 22 తేదీలలో 'హై లైఫ్ ఎగ్జిబిషన్' ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని ప్రముఖ డిజైనర్ల ద్వారా ఎంపిక చేయబడిన అత్యాధునిక దుస్తులు, ఆభరణాలు, ఫ్యాషన్ ఉపకరణాలు, గృహాలంకరణ వస్తువులు, ఆకర్షణీయమైన కలెక్షన్స్ ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాలలో అవసరమైన ఆభరణాలు, ప్రత్యేకమైన జీవనశైలి వస్తువుల కోసం ఎదురు చూసేవారికి గమ్యస్థానంగా ఈ ఎగ్జిబిషన్ నిలుస్తుందని, లగ్జరీ షాపింగ్ అనుభవం కలిగిస్తోందని పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పట్టని కూటమి ప్రభుత్వం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న రైతుల ఆవేదన గురించి చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి పట్టక పోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పాదిలి చంటిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిన్న మొన్నటి వరకు టమోటాకు, ప్రస్తుతం ఎండు మిర్చికి మద్దతు ధర లభించక రాష్ట్రవ్యాప్తంగా రైతులు కన్నీటి పర్యంతమవుతున్న తరుణంలో కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని తెలిపారు. వైఎస్ జగన్ గుంటూరు పర్యటనలో ఒక్క పోలీస్ కూడా లేరంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం కాదా అని ప్రశ్నించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): ఆర్టీసీ బస్సుల్లో సూదుర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారి సమస్యలను పరిష్కరించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని ఆటోనగర్ డిపో మేనేజర్ కె.ప్రవీణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు 99592 25463 నంబరుకు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

చెరకు లారీ బోల్తా



ఇబ్రహీంపట్నం: నందిగామ నుంచి ఉయ్యూరు చెరకు ఫ్యాక్టరీకి చెరకు లోడుతో వెళుతున్న లారీ బుధవారం తెల్లవారు జామున పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టింది. రోడ్డుపై చెరకు లోడు పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐ బి. లక్ష్మణరావు కూలీలను రప్పించి రోడ్డుపై పడిన చెరకును వేరే లారీలోకి లోడింగ్ చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దళితులపై వేధింపులు ఆపాలి

మైలవరం: దళితులపై పోలీసుల వివక్షత, వేధింపులు ఆపాలని ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు కోట డానియేలు మాదిగ డిమాండ్ చేశారు. మైలవరం ఆర్ అండ్ బీ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినప్పటికీ దళితుల పట్ల పోలీసులు అనుసరిస్తున్న విధానం మారడం లేదన్నారు. ఇటీవల మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామంలో దళితుడు వడ్లపూడి సంసోనుకు జరిగిన అన్యాయం చాలా బాధాకరమన్నారు. సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడానికి అనుమతినిచ్చిన పోలీస్ అధికారులు, పోలీస్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భయపెడుతున్న బర్డ్‌ఫ్లూ

- పాతబస్తీలో వెలవెలబోతున్న మార్కెట్లు
- మటన్, చేప, రొయ్యలకు పెరిగిన డిమాండ్
- ఇదే అదనుగా ధరలు పెంచుతున్న వ్యాపారులు



పాతబస్తీలోని చేపల మార్కెట్‌లో బోసిపోయిన కోళ్ల విక్రయ దుకాణాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోనూ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాపించడంతో మాంసాహారులు మటన్, చేపలపై మక్కువ చూపుతున్నారు. దీంతో పశ్చిమ నియోజకవర్గంలో కోళ్ల విక్రయాలు పూర్తిగా పడిపోయాయి. జిల్లాలో కొన్ని గ్రామాల్లో బర్డ్‌ఫ్లూ ప్రబలడంతో ఆయా ప్రాంతాల్లో చికెన్ తినరాదని అధికారులు ఆదేశాలు జారీ చేయడం... గత వారం రోజులుగా చికెన్ ప్రియులు బెంబేలెత్తుతున్నారు. ప్రత్యామ్నాయంగా మటన్, చేపలను వినియోగించడంతో వాటి ధరలు కొండెక్కుతున్నాయి. హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో సైతం చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి. దీంతో చాలా హోటల్స్‌లో చికెన్ వినియోగించక పోవడంతో ప్రత్యామ్నాయం కోసం వెతుకులాడుతున్నారు. ఈ నేపథ్యంలో చేపలు, రొయ్యలు, మటన్ దుకాణాలకు వినియోగదారులు పోటెత్తుతున్నారు. దీంతో ఆయా దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. పశ్చిమ నియోజకవర్గంలో పెద్ద మార్కెట్‌గా ఉన్న కొత్తపేటలోని హనుమంతరాయ వీఎంసీ మార్కెట్(చేపల మార్కెట్)లో కోళ్ల విక్రయ దుకాణాలు, చికెన్ సెంటర్లు వెలవెలబోతుంటే మటన్, చేపల మార్కెట్లో చేపల విక్రయాల మార్కెట్‌కు మాత్రం మాంసాహార ప్రియులు ఎగబడుతున్నారు.

అమాంతం పెరిగిన ధరలు

చికెన్‌కు వినియోగదారులు దూరంగా ఉన్న పరిస్థితుల్లో మటన్, చేపల కొనుగోలుకు మాంసాహారులు అధిక ప్రాధాన్యత చూపుతున్నారు. దీంతో మటన్ ధర కిలోకు వంద రూపాయల వరకు పెంచేశారు. గతంలో కిలో రూ.800 నుంచి రూ.900లు ఉండే ధర ఇప్పుడు రూ.900 నుంచి వెయ్యి వరకు చేరింది. మార్కెట్‌లో మేకలు, గొర్రెల ధరలు విపరీతంగా పెరిగాయని, ఒక్కో మేక, గొర్రె ధరను గతంతో పోల్చితే రూ.1,500 నుంచి రూ.2,000 వరకు యజమానులు పెంచేశారని విక్రయదారులు అంటున్నారు. చేపలు, రొయ్యలను సైజును బట్టి రూ.300 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు.

పడిపోయిన చికెన్ ధరలు

పాతబస్తీలోని చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. పది రోజుల క్రితం కిలో రూ.250 నుంచి రూ.300 మధ్య పలికిన చికెన్ ధర గడిచిన ఐదారు రోజుల నుంచి పడిపోయింది. నియోజకవర్గంలోని వివిధ మార్కెట్లలో ఉన్న చికెన్ స్టాల్స్‌లో రూ.150 నుంచి రూ.180 మధ్య విక్రయాలు చేస్తున్నారు. ధర పడిపోయినా చికెన్ వైపు చూసే వారు కరువై పోయారని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయంగా...

హోటల్స్‌లో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుండగా చిన్నపాటి హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో బిర్యానీతో మటన్ కైమా, రొయ్య, తలకాయ మాంసం, బోటీలను కూరలుగా వండి అమ్మకాలు చేస్తున్నారు. స్ట్రీట్ ఫుడ్ బండ్లలో ఫ్రైడ్‌రైస్, నూడిల్స్‌ను సైతం చికెన్, కోడిగుడ్డు లేక వెజ్ ఐటమ్‌గా విక్రయిస్తున్నారు. ఎన్ని రకాల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించినా చికెన్‌ను బీట్ చేయలేమంటూ మాంసాహారులు అభిప్రాయపడుతున్నారు. మాంసాహారంలో చికెన్ ఒక్క దానికే రకరకాల రూపాల్లో తీర్చిదిద్ది లొట్టలేసుకుంటూ తినే పరిస్థితి ఉంది. మిగిలిన వాటికి అన్ని రకాలుగా తీర్చిదిద్దే పరిస్థితి లేకపోవడంతో మాంసాహారులలో కొంత నైరాశ్యం కనిపిస్తోంది. దీంతో చేసేది లేక మటన్, చేపలపైనే మక్కువ చూపుతున్నారు.

బూడిద అక్రమ రవాణాపై ఆగ్రహం

అడ్డుకున్న స్థానికులు



బూడిద లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్‌ను అడ్డుకున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ట్రక్ టెర్మినల్ బూడిద చెరువులో బూడిద అక్రమ రవాణాపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాత బూడిద చెరువులో బూడిద లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్లు, లారీలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ అధికారులు నిషేధిత ప్రాంతంగా ప్రకటించిన పాత బూడిద చెరువులో యథేచ్ఛగా బూడిద లోడింగ్ జరపడంతో ఇళ్లపై బూడిద పడుతోందన్నారు. గతంలో మూసివేసిన చెరువులో తిరిగి తవ్వకాలు జరపడం ఏమిటని ప్రశ్నించారు. చెరువు మూసివేసి గ్రావెల్ తోలి ప్లాంటేషన్ చేపట్టారన్నారు. చెరువును తిరిగి రీ ఓపెన్ చేయడం, ప్లాంటేషన్ గుల్ల చేయడం ఏమిటని విమర్శించారు. వార్డు కౌన్సిలర్ రావి ఫణి మాట్లాడుతూ బూడిద అక్రమ రవాణాపై ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజును వివరణ కోరినా ఇప్పటి వరకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బూడిద పైపులను కావాలని లీకేజీలు చేసి పైపుల ద్వారా వచ్చిన బూడిదను గుట్టుచప్పుడు కాకుండా లారీల ద్వారా తరలిస్తున్నారని ఆరోపించారు. బూడిద అక్రమ రవాణాపై స్థానికుల ఆందోళన తెలుసుకున్న తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఎన్టీటీపీఎస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. అక్రమ రవాణాదారులపై స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. స్థానికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ లీగ్

విజయవాడస్పోర్ట్స్: అండర్-10, 12 బాలుర జిల్లా స్థాయి బ్లూ క్లబ్స్ ఫుట్‌బాల్ లీగ్‌ను ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శేషగిరిరావు, చక్రవర్తి బుధవారం తెలిపారు. విజయవాడ సత్యనారాయణపురంలోని రైల్వే కాలనీ గ్రౌండ్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 12 జట్లు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఫుట్‌బాల్ క్లబ్స్, స్కూల్స్ జట్లను ఈ పోటీలకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు సెల్ నంబర్లు 75690 51099, 94925 52566లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ సీతారామపురంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో లబ్బీపేటలోని దర్స్ గాహ్-ఎ-ఇస్లామి విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులు షీమాఫిర్దోస్, సనా, జోయ, మలిషా, అయేషా, అనిషా, సమి, హైదర్ సని, సహా, తాల్హా, రెహ్మాన్, బేగ్, రజా, బిలాల్, ఫర్హాన్, సదాబ్ రజా, రఫీజ్, సిద్ధిక్, జకిర్, ఫౌజాన్, ఇసాక్, ఎండీ రెహ్మాన్, హజ్మా, తహిర్‌అలీ, అబ్దుల్ ఫర్హాన్, హకీమ్, సయ్యద్ కాజా, అహ్మద్, అస్రార్, సుహేబ్‌లు కుమితే, కటా విభాగాల్లో పతకాలు సాధించడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు, కరాటే మాస్టర్ ఎండీ ఆరీఫ్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ గౌస్‌బాషా ఇలియాస్, డీపీసీ అధ్యక్షుడు ఎండీ రఫీక్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సాదిక్‌మొహియుద్దీన్, కార్యదర్శి మహ్మద్ ఖాన్‌ఉద్మి స్కూల్ ఆవరణలో బుధవారం అభినందించారు.

సంసోను కుటుంబానికి న్యాయం చేయాలి

కేవీపీఎస్ నాయకుల డిమాండ్



సంసోనును పరామర్శిస్తున్న నాయకులు

మైలవరం: చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే ఆ చట్టాన్ని ఉల్లంఘించి అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు గుండిమెడ క్రాంతికుమార్ అన్నారు. ఇటీవల మైలవరం మండలం మొర్సుమల్లి శివారు ములకలపెంటలో జరిగిన ఒక హత్యకు సంబంధించి విచారణ పేరుతో మొర్సుమల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్లపూడి సంసోనుపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడంతో బాధితుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అస్వస్థతకు గురైన సంసోను, అతని కుటుంబాన్ని బుధవారం మొర్సుమల్లి గ్రామానికి వెళ్లి కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ పోలీసులు కుల వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు అగ్రకులాల వారిని ఒక రకంగా చూస్తూ దళితులను మరో రకంగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు ఈ హత్య కేసులో మృతుని సొంత కమారుడే హత్య చేశాడని పోలీసులు అతనిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా సంసోనును తీసుకువచ్చి చిత్రహింసలు పెట్టడం తగదని, సంబంధిత అధికారులుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. కుటుంబరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద వెంకటేశ్వరరావు, కోట డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకూడదు

నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమవకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశ హాలులో ఇంజినీరింగ్ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, ప్రత్యేకించి కొండప్రాంతాలకు ఎలాంటి లోటు లేకుండా తాగునీటి సరఫరా జరగాలని స్పష్టంచేశారు. అందుకు అనుగుణంగా కావాల్సిన వాహనాలను, వాటర్ ట్యాంకర్లను సమకూర్చుకోవాలని సూచించారు. జనాభా ఎక్కువగా ఉన్నచోట తాగునీటి సౌకర్యాలను మరింత పెంచాలన్నారు. నగర పరిధిలోని తాగునీటి ప్రాజెక్టులు, పార్కుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందీ కలగకుండా, ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రస్తుతం ఉన్న అన్ని బోరులను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలాంటి నీటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని అసిస్టెంట్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల నుంచి వారు విధులు నిర్వహిస్తున్న వార్డు, ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించే దిశగా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలకు పదును పెట్టాలి



కేబీఎన్ కళాశాలలో మాట్లాడుతున్న నాగలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పట్టుదలతో తమలోని నైపుణ్యాలకు పదును పెట్టి ముందుకు సాగితే మంచి ఫలితాలను అందుకోవచ్చని ఇమీస్ మేనేజింగ్ డైరెక్టర్ డి.నాగలక్ష్మి అన్నారు. కేబీఎస్ కళాశాల పీజీ విభాగం ఆధ్వర్యంలో మస్త్ 2కె25 పేరుతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ బుధవారం ఉత్సాహ భరితంగా సాగింది. ఈ సందర్భంగా ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ఎప్పటికప్పుడు మారుతున్న పోకడలను అవగాహన చేసుకుంటూ తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు కల్చరల్, కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు తమ కళాశాల అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వ్యక్తిత్వ నైపుణ్యాలు పెరుగుతాయి..

పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేష్ మాట్లాడుతూ.. యువతరంలో ప్రతిభను ప్రోత్సహించేదుకు తమ కళాశాల పక్షాన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ నైపుణ్యాలు పెరుగుతాయని చెప్పారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ఏఓ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు యువతరంలో సృజనాత్మకత అధికంగా ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా మెదడు చైతన్యవంతమవుతుందని చెప్పారు. విద్యార్థులు బిజినెస్ క్విజ్, మార్కెట్ మేకర్స్, యంగ్ మేనేజర్, స్టాక్ గేమ్, మూవీ క్విజ్, డ్యాన్స్, మిస్టర్ అండ్ మిస్ మస్త్, ట్రెజర్ హంట్, ఐపీఎల్ ఆక్షన్, స్పాట్ ఫొటోగ్రఫీ, రీల్ ఇట్ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేంకటేశ్వరరావు, ఎంబీఏ విభాగాధిపతి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చిలుకూరి విజయకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరమని ప్రముఖ ఆర్థిక విశ్లేషణ నిపుణుడు చిలుకూరి విజయకుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్' అంశంపై వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్థిక నిర్వహణపై పట్టు సాధించడం ద్వారా అనేక విజయాలను అందుకోవచ్చన్నారు. సేవ్ ఫస్ట్- స్పెండ్ నెక్స్ట్ నినాదంతో ముందుకు అడుగులు వేయాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాలతో పాటుగా ఆర్థికాంశాలపై పట్టు సాధించడంతో మరిన్ని విజయాలను అందుకోవటానికి అవకాశముంటుందన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత ఆర్థిక నియంత్రణ, పెట్టుబడుల ప్రాముఖ్యత, ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, కోఆర్డినేటర్ ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ స్ఫూర్తిని కొనసాగించాలి



శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలోని ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ స్ఫూర్తిని కొనసాగించాలని మాజీ కార్పొరేటర్ ఉత్తమ్‌చంద్ భండారీ అన్నారు. బీజేపీ పాతబస్తీ ఆధ్వర్యంలో స్థానిక సామారంగం చౌక్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. బీజేపీతో పాటు వివిధ పార్టీలకు చెందిన నేతలు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భండారీ మాట్లాడుతూ శివాజీ అద్భుతమైన పరిపాలనను అందించారన్నారు. దేశంలో ఆయన పరిపాలన చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. శివాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సుజనాచౌదరి కార్యాలయం కార్యదర్శి శ్రీధర్, నాయకులు రాజు సోలంకి, పొట్టి శ్రీహరి, బండి కాళీ, దాడి జగన్, దాడి మురళీ, కనిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.




అర్థంతరంగా నిలిపివేసిన నిర్మాణ పనులు



కాలేజీలో తిరుగుతున్న వీధికుక్కలు

ఉర్దూ కళాశాలపై చిన్నచూపు !



తాగిపడేసిన మద్యం బాటిల్



ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

కబేళా సెంటర్‌లోని గవర్నమెంట్ జూనియర్ ఉర్దూ కళాశాలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద అదనపు తరగతి గదుల అంతస్తును నిర్మించారు. ప్రభుత్వం మారడంతో ఈ పనులను అర్థంతరంగా నిలిపివేశారు. కళాశాలకు ప్రహరీ కూడా లేకపోవడంతో మద్యం, గంజాయి బ్యాచ్‌కు ఇది అడ్డాగా మారింది. దీనికి తోడు పిచ్చిమొక్కలు పెరగడంతో చిట్టడవిని తలపిస్తోంది. అధికారులు, నేతలు స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కాలేజీ ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

బీసీ బాలికల వసతిగృహాన్ని సందర్శించిన డెప్యూటీ కలెక్టర్

మైలవరం: మైలవరం పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని డెప్యూటీ కలెక్టర్ మహేష్ (జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి) బుధవారం సందర్శించారు. వసతి గృహంలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ సక్రమంగా విధులకు హాజరు కావడంలేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వసతి గృహంలో భోజనాలు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం గత రెండేళ్లలో ఎప్పుడూ భోజనం తయారు చేయలేదన్నారు. కాగా డెప్యూటీ కలెక్టర్ సందర్శనకు వచ్చినప్పటికీ సదరు వార్డెన్ వసతి గృహానికి రాకపోవడం గమనార్హం. డెప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ లిఖిత పూర్వకంగా నివేదిక రాసుకుని, తదుపరి కలెక్టర్‌కు పంపుతామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వార్డెన్ రమాదేవి అందుబాటులోకి రానందున ప్రస్తుతం బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ నరసింహారావుకు బాధ్యతలు అప్పగించారు.